ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పేజీలు : 4 | సంపుటి : 01 | - సంచిక 189 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | శనివారం12 - 10 - 2024 | వెల - 2 | Digital Edition


## కేసీఆర్‌కు ఈడీ బిగ్ షాక్!



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు ఈడీ షాక్ ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన జీఎస్టీ స్కామ్ పై ఈడీ కేసు నమోదు చేసింది. జీఎస్టీ చెల్లింపుల్లో రూ.46 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఇప్పటికే దీనిపై హైదరాబాద్ లో కేసు నమోదు చేశారు పోలీసులు.

**అసలు ఏంటి ఈ కేసు...**

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) లావాదేవీల్లో ఇన్‌పుట్ ??ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపునకు సంబంధించి అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై తెలంగాణ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌పై హైదరాబాద్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. రూ. 1,000 కోట్లకు పైగా విలువైన ఈ కుంభకోణం నాలుగేళ్ల క్రితం భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ప్రభుత్వంలో కుమార్ రెవెన్యూ (వాణిజ్య పన్నులు) స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నప్పుడు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందిన తర్వాత, ఆదాయాన్ని ఆర్జించే అన్ని శాఖలకు ఆయనే ఇన్‌ఛార్జ్‌గా కొనసాగారు.

కుమార్, మరో ముగ్గురు వ్యక్తులు, ఒక సంస్థ జీఎస్టీ చెల్లింపుదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ఖజానాకు రూ. 1,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ కె. రవికుమార్ పోలీసు డిటెక్టివ్ విభాగానికి ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదుపై చర్య తీసుకున్న పోలీసులు వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, ఎ. శివ రామ ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.



# పేదలకు మోదీ సర్కారు దసరా కానుక

## ఉచిత రేషన్ మరో 4 ఏళ్లు పొడిగింపు..!

**ఢిల్లీ అక్టోబర్ 11( రిపబ్లిక్ న్యూస్):** : దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి పైగా పేదలకు రేషన్ ద్వారా ఉచిత ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసే పథకం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనను మరో నాలుగేళ్లపాటు కొనసాగించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

కేంద్ర ప్రభుత్వం పేదలకు గుడ్ న్యూస్ చెబుతూ దసరా కానుక అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం 2028 డిసెంబరు వరకు ఉచిత బియ్యం సరఫరా పథకాన్ని (విటమిన్లు కలిపిన ఉచిత ఫోర్టిఫైడ్ రైస్) పొడిగించడానికి ఆమోదించింది. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 సమృద్ధిగా అందించడం ద్వారా భారతదేశంలో రక్తహీనత, సూక్ష్మపోషక పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడమే ఈ చొరవ లక్ష్యంగా పేర్కొంది.

ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పి ఎం జి కే వై), ఇతర సంక్షేమ పథకాలతో సహా ప్రభుత్వ అన్ని పథకాల క్రింద జులై 2024 నుండి సార్వత్రిక ఉచిత బలవర్ధక బియ్యాన్ని అదించడం డిసెంబర్ 2028 వరకు కొనసాగించడానికి బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**ఫోర్టిఫైడ్ రైస్ అంటే ఏమిటి? రేషన్ లో ఇస్తున్నవి ఇవేనా?**

సాధారణ బియ్యాన్ని పిండిలా చేసిన తర్వాత వాటికి అవసరమైన మోతాదులో విటమిన్లను, ఖనిజాలను కలుపుతారు. మళ్లీ వీటిని బియ్యంగా మారుస్తారు. ఈ గింజలనే ఫోర్టిఫైడ్ రైస్ (ఫోర్టీఫైడ్ కెర్నల్స్) అంటారు.

-మిగతా2లో

## కాంట్రవర్సికి కేరాఫ్.. ఆమ్రపాలికి ఎందుకంతా క్రేజ్



'గతంలో పనిచేసిన కలెక్టర్లు ఈ భవనం మొదటి అంతస్తులో దెయ్యం ఉందని నాతో చెప్పారు.. అందుకే ఆ గదిలో పడుకోవడానికి నేను సాహసించలేను..' 2018 ఆగస్టులో వరంగల్ కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం గురించి నాడు అదే జిల్లాకు కలెక్టర్‌గా ఉన్న ఆఫీసర్ ఆమ్రపాలి చేసిన వ్యాఖ్యలివి. ఈ కామెంట్స్ అప్పట్లో తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నిజానికి ఆమ్రపాలి ఏం చేసినా అది సంచలనమే.. అది చర్చనీయాంశమే.. ఏం మాట్లాడినా అది రచ్చే..! ఇక ప్రస్తుతం కమిషనర్‌గా దూకుడు కనబరుస్తున్న ఆమ్రపాలితో పాటు మరికొంతమంది ఐపీఎస్, ఐఏఎస్ ఆఫీసర్లను అనూహ్యంగా ఏపీకి రిపోర్టు చేసుకోవాలని కేంద్రం డీవోపీటీ ఆదేశాలు జారీ చేయడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ లెక్కన ఆమ్రపాలి ఏపీకి వెళ్లాల్సి ఉంటుంది. ఇది రేవంత్ సర్కార్‌కు కాస్త ఇబ్బంది పెట్టే విషయంగానే అనిపిస్తోంది.ఆమ్రపాలి 1982, నవంబరు 4న ఏపీలోని విశాఖపట్నంలో కాట వెంకట్ రెడ్డి, పద్మావతి దంపతులకు జన్మించారు. ఆమె తండ్రి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర బోధకుడిగా పనిచేశారు.

ఆమె స్కూలింగ్ అంతా విశాఖపట్నంలోని సాయి సత్య మందిర్ స్కూల్‌లో జరిగింది.

-మిగతా2లో

## వైసీపీ అంటేనే ఫేక్.. లోకేష్ ఫైర్!



**ఏపీలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నారని వైసీపీ ఎంపీ గురుమూర్తి చేసిన ట్వీట్‌కు కౌంటర్ ఇచ్చారు లోకేష్. వైసీపీ అధ్యక్షుడు నుంచి కార్యకర్త వరకు అందరు ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను తమ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.**

మాజీ సీఎం జగన్ పై మరోసారి ట్విట్టర్ వేదికగా నిప్పులు చెరిగారు మంత్రి లోకేష్. అధ్యక్షుడు జగన్ నుంచి వైసీపీ కార్యకర్త వరకు అందరూ ఫేక్ ప్రచారమే ఆయుధంగా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీలో చికిత్సలు తగ్గించారని, ఆరోగ్యశ్రీ పథకం నిలిపివేస్తున్నారని తప్పుడు ప్రచారంలో వైసీపీ ఎంపీ గురుమూర్తి కూడా భాగమయ్యారని అన్నారు. వైసిపి అధ్యక్షుడు జగన్ నుంచి వైసీపీ కార్యకర్త వరకు అందరూ ఫేక్ ప్రచారమే ఆయుధంగా రాజకీయాలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీలో చికిత్సలు తగ్గించారని, ఆరోగ్యశ్రీ పథకం నిలిపివేస్తున్నారని తప్పుడు ప్రచారంలో వైసీపీ ఎంపీ గురుమూర్తి కూడా భాగమయ్యారు. ఫేక్‌కి ఫ్యాక్ట్‌కి తేడా తెలియని ఎంపీ గారు మీ ఫేక్‌కి ఫ్యాక్ట్‌కి తేడా తెలియని ఎంపీ గారు మీ హయాంలోనే పెట్టిన ఆరోగ్యశ్రీ బకాయిలను తాము చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీని పేదలకు వరంగా అందిస్తున్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాలు మానండి ఎంపీ అంటూ చురకలు అంటించారు. మీ నియోజకవర్గ ప్రజల సమస్యలు తీర్చే పనిలో మా ప్రభుత్వ సహకారం తీసుకోండి.. అప్పుడు ఎన్నుకున్న మీ ప్రజలకు న్యాయం చేసిన వారు అవుతారు అని హితవు పలికారు.



## ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్

పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర జల శక్తి శాఖ తొలిసారిగా అడ్వాన్స్ నిధులు విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,348 కోట్లు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

**ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పర్యటన ఈరోజు.. పనులు పరుగులు పెడతాయా?**

దసరా పండుగ వేళ ఏపీకి తీపి కబురు అందించింది మోదీ సర్కార్. పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర జల శక్తి శాఖ తొలిసారిగా అడ్వాన్స్ నిధులు విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,348 కోట్లు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా కొన్ని షరతులను జోడించి ప్రకటన చేసింది. ఇదిలా ఉంటే సీఎం చంద్రబాబు వరుస ఢిల్లీ పర్యటనలు సఫలం అయ్యాయనే చెప్పాలి. ఏపీలో ప్రభుత్వ ఏర్పాటు నుంచి పలుమార్లు హస్తినకు వెళ్లిన సీఎం చంద్రబాబు.. ప్రధాని మోదీతో సహా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం అయ్యారు. ఏపీ అభివృద్ధిపై, రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, పోలవరం పూర్తి చేసేందుకు నిధులు వంటి ముఖ్యమైన అంశాలపై సీఎం చంద్రబాబు కేంద్ర పెద్దలతో చర్చలు జరిపారు.

**కేంద్ర పెట్టిన షరతులు..**

ప్రస్తుతం ఇచ్చిన రూ.2,348 కోట్ల నిధుల్లో 75 శాతం ఖర్చు చేస్తేనే తదుపరి విడత నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపింది.

నిర్దేశిత లక్ష్యాల ప్రకారం పోలవరం నిర్మాణ పనులు జరిగితేనే తదుపరి విడత నిధులు విడుదల చేస్తాం.ఒకవేళ కాకపోతే సరైన కారణాలు తెలపండి.

చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జల శక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం తెలపాలి.

పెండింగ్ లో పడ్డ పోలవరం పనులు పూర్తి కావడానికి సమన్వయ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలి.

కేంద్ర మంత్రిమండలి ఆమోదించిన దానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన ప్రకారం పోలవరం ప్రాజెక్టు సవరించిన నిర్మాణ షెడ్యూల్‌ను ఒప్పందంలో

-మిగతా2లో

## ఏపీ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్, లోకేశ్...




**అమరావతి అక్టోబరు 11(రిపబ్లిక్ న్యూస్) :** తెలుగు ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. మంచిపై చెడు గెలిచిన సందర్భంగా దసరా పండగ నిర్వహించుకుంటారని మంత్రి లోకేశ్ తెలిపారు. ఈసారి దానితోపాటు ఏపీలో వైసీపీపై ఎన్డీయే కూటమి గెలిచిన సందర్భంగా పండగ ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఎక్స్ వేదికగా దసరా శభాకాంక్షలు తెలుపుతూ మంత్రులు ట్వీట్ చేశారు.

మంత్రి లోకేశ్ ట్వీట్ ఇదే..

"తెలుగు ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ధ్వంసం చేసి ప్రజల్ని హింసించిన జగనాసురుడి దుష్టపాలనను ప్రజలే అంతమొందించారు. వైసీపీ చెడుపై కూటమి మంచి విజయం సాధించింది. వరద రూపంలో వచ్చిన విపత్తుపై విజయం సాధించాం. వేలాది ఉద్యోగాలు ఇచ్చే లులూ, ఫాక్స్ కాన్, హెచ్సీఎల్ విస్తరణ, టీసీఎస్ తెచ్చుకున్నాం. పోలవరం సాకారం కానుంది. విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపన జరగనుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తోంది. ఇన్ని మంచి విజయాలు అందించిన ఈ విజయదశమిని సంతోషంగా జరుపుకుందాం. ప్రజా సంక్షేమం- రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా శ్రమిస్తున్న మంచి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు, దుర్గమ్మ ఆశీస్సులు లభించాలని కోరుకుంటున్నా".

2లో

## పాత రేషన్ కార్డులను రద్దు చేయనున్న ఏపీ ప్రభుత్వం



**అమరావతి అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):** వైసీపీ రంగులతో ఉన్న పాత రేషన్ కార్డులను ఏపీ ప్రభుత్వం రద్దు చేయనుంది. వాటి స్థానంలో కొత్త కార్డులను ప్రభుత్వం ఇవ్వనుంది. అలాగే నూతన దంపతులకు కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. కొత్త రేషన్ కార్డుల రూపకల్పనపై పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. లేత పసుపు రంగుతో ఏపీ అధికారిక చిహ్నం ముద్రించిన కార్డుల నమూనాను ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించారు. మరికొన్ని నమనాలను కూడా ప్రభుత్వం పరిశీలనకు పంపించారు.

## ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఏర్పాటుపై జీవో విడుదల చేసిన సర్కార్



**తెలంగాణ (అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్)** తెలంగాణ సర్కార్ మరో ఎన్నికల హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ ఎన్నికల ఆరు గ్యారంటీల హామీల్లో ప్రధానమైనది ఇందిరమ్మ ఇళ్ళు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇళ్ళులబ్దిదారులను గుర్తించేందుకు

2లో




# ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్

ఒప్పందంలో పేర్కొన్న పనులకే ఇప్పుడిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిధులను వెచ్చించాలి.

నిర్దేశిత పనులకే ఆ నిధులు వినియోగించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి పోలవరం ప్రాజెక్టు అథారిటీ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి. వాటిని కేంద్ర జలశక్తిశాఖకు పంపాలి.

ఈ నిధులకు సంబంధించిన ఖాతాలను కాగ్ అధికారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి త్రైమాసికంలో ప్రాజెక్టు ఆర్థిక పురోగతిపై కేంద్రానికి అథారిటీ నివేదికలు సమర్పించాలి.

# ఏపీ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపినపవన్ కల్యాణ్, లోకేశ్..

**పవన్ కల్యాణ్ ట్వీట్..**

"జయ జయహే మహిషాసుర మర్ధిని రమ్యక పర్దిని శైలసుతే అంటూ ఆ పరమేశ్వరిని హైందవులంతా కొలిచే నవరాత్రులు ముగింపుగా ప్రవేశిస్తున్న విజయ దశమి పర్వదినం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. భారతదేశం నలుమూలలా భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ శరన్నవరాత్రులను ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక వేడుకగా చెప్పుకోవచ్చు. ఊరు, వాడలంతా అమ్మవారి సంబరాలతో భక్తి భావం ఉట్టిపడుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలైన తెలంగాణలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటగా, ఆంధ్రప్రదేశ్‌లో ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయం కిక్కిరిసి భక్తులతో అలరారుతోంది. ఈ నవరాత్రులలో దుర్గమ్మను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ విజయదశమి ప్రజలందరికీ విజయాలు చేకూర్చాలని, తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా విరాజిల్లాలని శక్తి స్వరూపిణిని ప్రార్థిస్తున్నాను".

మంత్రి టీజీ భరత్..

ఏపీ ప్రజలందరికీ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా పండగ జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి సందర్భంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికీ విజయాలు లభించాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్ చెప్పారు.

# ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఏర్పాటుపై జీవో విడుదల చేసిన సర్కార్

ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన జీవోను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది.

గ్రామపంచాయితీల్లో, మున్సిపల్ వార్డు స్థాయిల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ ప్రభుత్వం జీవోలో పేర్కొంది. గ్రామస్థాయిల్లో సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి చైర్ పర్సన్ ఉండగా.. మున్సిపాలిటీ స్థాయిల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్ పర్సన్ గా ఉండనున్నారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్ గా పంచాయితీ కార్యదర్శి, వార్డ్ ఆఫీసర్ ఉంటారు. అలాగే కమిటీలో ఇద్దరు ఎస్ హెచ్జీ సభ్యులు, ముగ్గురు స్థానికులు ఉండనున్నారు. కాగా ఈ కమిటీలు శనివారం నాటికి ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు అందాయి. కమిటీల కోసం పేర్లు పంపాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ కమిటీలు ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు అవగాహన కల్పించడంతోపాటు, అనుమానాలు నివృత్తి చేస్తారు.


# ఐటీ ఉద్యోగి సైకిల్‌యాత్ర!




**రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 11(రిపబ్లిక్ న్యూస్) :** జీవితం అంటే ఇంతేనా.. చాలా మందికి వచ్చే క్వశ్చన్ మార్క్ ఇది.. కొత్తగా ఏదో ఒకటి చేయాలని అనుకుంటారు.. అయితే అందరూ అలా చేయలేరు.. కొంత మంది మాత్రమే ఆ వైపు అడుగులు వేస్తారు.. ఈ చిత్రంలో చూస్తున్నారుగా ఇతని పేరు అన్నెంనీడి మనోజ్ కుమార్.. బెంగళూరులో ఐటీ ఉద్యోగి..ఏ కష్టం లేదు.. ఆ జీవితం రోటీన్ అనిపించింది.. దేశంలో ఐదు వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేయాలని తలంచారు.. అనుకున్నదే తడవుగా గత నెల 28వ తేదీన యాత్ర ప్రారంభించారు.. గురువారానికి రాజ మహేంద్రవరం చేరుకున్నారు..48 రోజుల్లో మరో 4 వేల కిలోమీటర్లు కవర్ చేయాలని చెప్పుకొచ్చారు.. రాజమహేంద్రవరం లో తన మావయ్య ఉన్నట్టు చెప్పారు.

# హైదరాబాద్ రోడ్లన్నీ ఖాళీ..

దసరా పండగ వేళ.. భాగ్యనగరం నిర్మానుష్యంగా మారింది. పండగ కోసం నగర ప్రజలు స్వస్థలాలకు వెళ్లారు. దీంతో నగరంలోని రహదారులన్నీ బోసిపోయాయి. అలాగే నగరంలోని ఆర్టీసీ బస్సులు సైతం ప్రయాణికులు లేకుండా ఖాళీగా తిరుగుతున్నాయి. దసరా పండగ నేపథ్యంలో వరుసగా సెలవులు రావడంతోపాటు నగర జీవులు.. వారి వారి స్వస్థలాలకు పయనమయ్యారు. మరోవైపు నవరాత్రుల్లో ప్రధాన పండగలు దుర్గాష్టమి, నవమి, దశమిలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి.



దీంతో బుధవారమే హైదారబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు ప్రజలు పయనమయ్యారు. దాంతో రైళ్లు, బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఇక హైదరాబాద్ నగరం నుంచి వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. అలాగే దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.

# కాంట్రవర్సికి కేరాఫ్.. ఆమ్రాపాలికి ఎందుకంతా క్రేజ్

తర్వాత ఆమె చెన్నైలోని ఐఐటి మద్రాస్ నుంచి ఇంజనీరింగ్‌లో పట్టభద్రురాలయ్యారు. ఆ తర్వాత బెంగుళూరు నుంచి మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఇక యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఆల్-ఇండియా 39వ ర్యాంక్‌ను సాధించి, ఐఏఎస్‌కు ఎంపికైన అతి పిన్నవయస్కుల్లో ఒకరిగా నిలిచారు.

2010 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన ఆమ్రపాలి యంగ్ డైనమిక్ ఆఫీసర్‌గా తక్కువ సమయంలోనే పేరు తెచ్చుకున్నారు. ముందుగా ఆమె కెరీర్ వికారాబాద్ సబ్ కలెక్టర్‌గా ప్రారంభమైంది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేశారు. 2015లో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, ఆ తర్వాత వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఇక 2020లో ఆమ్రపాలి ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా నియమితులయ్యారు. డిప్యుటేషన్ పూర్తి చేసిన తర్వాత మళ్లీ తెలంగాణ సర్వీసుల్లో చేరి ప్రస్తుతం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

అటు ఆమ్రపాలి కెరీర్‌లో ఎన్నో ఘనతలు ఉన్నట్టే పలు సార్లు ఆమె విమర్శలపాలైన సందర్భాలూ ఉన్నాయి. 2018లో వరంగల్ అర్బన్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆమె అనేక విమర్శలను ఎదుర్కొన్నారు. నాటి గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో తెలుగులో కొన్ని పదాలు ఉచ్చరించలేక పగలబడి నవ్వారు. ఇక రాష్ట్ర బహిరంగ మలవిసర్జన రహిత పథకం గురించి మాట్లాడుతున్నప్పుడు ఆమె నవ్వకుండా ఉండలేకపోయారు. 'మరుగుదొడ్లు' అని ఉచ్చరిస్తున్నప్పుడు రెండుసార్లు నవ్వారు. 2017లో, ఆమె తన సిబ్బందికి బాహుబలి-2 సినిమా చూసేందుకు వీలుగా మొత్తం థియేటర్‌ని బుక్ చేశారు. టిక్కెట్లను పెద్దమొత్తంలో కొనుగోలు చేసేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేశారని పిటిషనర్ ఆరోపించడంతో ఆమె న్యాయపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇక ఇటీవల తెలంగాణలో కాక రేపిన హైడ్రా విషయంలో కూడా ఆమ్రపాలి తనదైన శైలిలో రియాక్ట్ అయ్యారు. మొదట్లో హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసినప్పుడు జీహెచ్ఎంసీలో పనిచేసే కొంత మంది విజిలెన్స్ సిబ్బందిని హైడ్రా కోసం కేటాయించడం వివాదానికి కారణమైంది. జీహెచ్ఎంసీ నుంచి కేటాయించిన విజిలెన్స్ అధికారులను తిరిగి తమ శాఖకు పంపించాలని హైడ్రా నుంచి రిలీవ్ చేయాలని ఆమె హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు లేఖ రాయడం సంచలనం రేపింది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఆమెను ఏపీకి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది. ఎందుకంటే యూపీఎస్సీ అప్లికేషన్‌లో ఆమ్రపాలీ పర్మినెంట్ అడ్రస్ విశాఖగా ఉంది.

# పేదలకు మోడీ సర్కారు దసరా కానుక..

దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం ఫోర్టిఫైడ్ రైస్ ను అందివ్వడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఫైలట్ ప్రాజెక్టుగా కొనసాగుతోంది. ఏప్రిల్ 2022లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సి సి ఈ ఏ) మార్చి 2024 నాటికి దశలవారీగా దేశవ్యాప్తంగా బియ్యం బలపరిచే కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. పూర్తిగా పోర్టిఫైడ్ రైస్ ను అందించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎంజికెఏవై), ఇతర పథకాలతో సహా ప్రభుత్వ అన్ని పథకాల క్రింద సార్వత్రిక ఉచిత ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కొనసాగించడానికి బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సంక్షేమ పథకాలు జూలై 2024 నుండి డిసెంబర్ 2028 వరకు ఈ పథకాలు కొనసాగుతాయి. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాల ప్రకారం పీఎంజీకేఏవై, (ఆహార సబ్సిడీ)లో భాగంగా ప్రభుత్వం 100 శాతం కేంద్ర నిధులతో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో మరో నాలుగేళ్లు అంటే 2028 వరకు కొనసాగనుంది.

దేశ పేద జనాభాలో రక్తహీనత, సూక్ష్మపోషక పోషకాహార లోపాన్ని పరిష్కరించడానికి, ఆహార బలపరిచేటటువంటి సురక్షితమైన, సమర్థవంతమైన చర్యగా ప్రపంచవ్యాప్తంగా దీనికి ప్రశంసలు ఉన్నాయి. భారతదేశంలో బియ్యం సూక్ష్మపోషకాలను సరఫరా చేయడానికి బియ్యం అనువైన వారది.. ఎందుకంటే జనాభాలో 65 శాతం మంది దీనిని ప్రధాన ఆహారంగా వినియోగిస్తున్నారు.

సాధారణ బియ్యం (కస్టమ్ మిల్లింగ్ రైస్)కు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సూక్ష్మపోషకాలు (ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12)తో సమృద్ధిగా ఉన్న ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కె)ను రైస్ ఫోర్టిఫికేషన్‌లో చేర్చడం జరుగుతుంది. ఏప్రిల్ 2022లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సి సి ఈ ఏ) మార్చి 2024 నాటికి దశలవారీగా దేశవ్యాప్తంగా బియ్యం బలపరిచే కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

మూడు దశలు విజయవంతంగా పూర్తయ్యాయనీ, మార్చి నాటికి ప్రభుత్వ పథకాలన్నింటిలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేసేందుకు సార్వత్రిక కవరేజీ లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రివర్గం తెలిపింది. దేశంలో పోషకాహార భద్రత ఆవశ్యకతపై 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రక్తహీనతను పరిష్కరించడానికి "టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (టిపిడిఎస్), ఇతర సంక్షేమ పథకాలు, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ (ఐ సి డి ఎస్), పి ఎం పోషణ (పూర్వపు ఎం డి ఎం) అంతటా బలవర్ధకమైన బియ్యం సరఫరా" వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.


ఇటీవలి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ ఎఫ్ హెచ్ ఎస్-5) ప్రకారం, రక్తహీనత భారతదేశంలో విస్తృతమైన సమస్యగా మిగిలిపోయింది. వివిధ వయస్సుల సమూహాలు,



ఆదాయ స్థాయిలలో పిల్లలు, మహిళలు, పురుషులను ప్రభావితం చేస్తుంది.

ఈ పథకం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పి ఎం జి కే వై)తో సహా ప్రధాన ప్రభుత్వ కార్యక్రమాలను కవర్ చేస్తుంది. జూలై 2024 నుండి డిసెంబర్ 2028 వరకు అమలులో ఉంటుంది. రక్తహీనత, పోషకాహార లోపాలను తగ్గించే లక్ష్యంతో బలవర్ధకమైన బియ్యం పంపిణీకి చొరవగా పి ఎం జి కే వైకింద కేంద్ర ప్రభుత్వం 100% నిధులు సమకూరుస్తుంది. అధికారిక ప్రకటన ప్రకారం ఈ పథకం దేశవ్యాప్తంగా బియ్యం బలవర్ధకానికి ఏకీకృత వ్యవస్థను నిర్ధారిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 80 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరుస్తుంది.

# "మీరు సిగ్గులేని వారు కావచ్చు,నేను కాదు" - రతన్ టాటా



**నంద్యాల (అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్)**

26/11 ముంబై దాడులకు కొన్నినెలల తరువాత భారత్ మరియు విదేశాల్లో ఉన్న తమ హొటళ్ళన్నీ రీమోడలింగ్ చేయడం కోసం అతి పెద్దవైన టెండర్లను టాటా కంపెనీ ఆహ్వానించింది. కొన్ని పాకిస్తానీ కంపెనీలు కూడా టెండర్లు వేసాయి.

ఆ కాంట్రాక్టు తాము దక్కించుకునేందుకు చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా, ఇద్దరు పాకిస్తానీ పారిశ్రామికవేత్తలు ఎలాంటి అపాయింట్ మెంటూ లేకుండా రతన్ టాటాను కలిసేందుకు బొంబాయిలో ఉన్న బొంబాయి హౌస్ (టాటా హెడ్ ఆఫీస్) కు వచ్చారు.

అక్కడి ఆఫీసులో, వారిద్దరూ రతన్ టాటాను కలవడం కోసం చాలా సేపు నిరీక్షించారు. అలా వారు కొన్నిగంటల పాటు నిరీక్షించిన తరువాత సిబ్బంది వచ్చి, సార్ చాలా బిజీగా ఉన్నారు, అపాయింట్ మెంట్ లేనివారినెవరినీ కలవలేరు అని చెప్పి వెళ్ళిపోయారు.

దాంతో నిరాశ చెందిన వారిద్దరూ హస్తినకు వెళ్ళి, పాకిస్తాన్ హైకమీషన్ ద్వారా అప్పటి ఒక మంత్రిని కలిసి విషయం వివరించారు.

ఆ వెంటనే ఆ మంత్రి రతన్ టాటాకు ఫోన్ చేసి ఆ పాకిస్తానీలిద్దరినీ కలవాలని, వారి టెండర్లను పరిశీలించాలని గట్టిగా అడిగారు.

అప్పుడు రతన్ టాటా "మీరు సిగ్గు లేని వారు కావచ్చు, నేను కాదు" అని చెప్పి ఫోన్ పెట్టేసారు.


ఆ తరువాత పాకిస్తాన్ ప్రభుత్వం టాటా సుమోలను దిగుమతి చేసుకోవడం కోసం ఆర్డరు ఇచ్చింది.

అయితే రతన్ టాటా ఒక్క సుమోను కూడా పాకిస్తాన్ కు పంపడానికి అంగీకరించలేక, ఆ ఆర్డరును తిరస్కరించారు.

అదీ రతన్ టాటా యొక్క దేశభక్తి.

ఆయన దేశభక్తి ముందు డబ్బూ మరియు వ్యాపారం కూడా చిన్నదే..అంతటి గొప్ప దేశ భక్తున్ని కోల్పోవడం బాధాకరం.

# పారిశ్రామిక రత్నం



ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా ఎనిమిదిపదులు దాటిన వయసులో కన్నుమూసిన వార్త ఆశ్చర్యం కలిగించకున్నా, దేశానికి ఎంతో ఆవేదన మిగల్చింది. పారిశ్రామికవేత్తలు మరణించినప్పుడు ఉన్నతస్థానాల్లోని వారంతా నివాళులు అర్పించడం సర్వసాధారణం. కానీ, రతన్ టాటా మరణవార్త చెవినపడగానే, సామాన్యులు, మధ్యతరగతి జనం సైతం ఆత్మబంధువును కోల్పోయినట్టుగా బాధపడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. సామాజిక మాధ్యమాల్లో ఆయన చిత్రాలు, విడియోలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఎవరి మనసుకు తోచిన మాటతో వారు తమ బాధను పంచుకుంటున్నారు. బడాపారిశ్రామికవేత్తలపట్ల సమాజంలో సహజంగా ఉండే గిట్టనితనం రతన్‌టాటాకు వర్తించపోవడానికి ఆయన అరుదైన, ఆదర్శవంతమైన జీవనవిధానం కారణం.

స్వాతంత్ర్యానికి పూర్వంనుంచే ఆయన సంస్థ ఉంది. పెట్టుబడికి తగిన లాభాన్ని రాబట్టే పట్టుదలతో పాటు, దేశంపట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత కూడా ఆ కుటుంబీకుల్లో ఉంది. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అడుగిడిన తరుణంలో బాధ్యతలు స్వీకరించిన రతన్‌టాటా హయాంలో గ్రూప్ పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించాయి. ఇప్పటి ఆశ్రితపెట్టుబడిదారుల మాదిరిగా అప్పటిపాలకులనుంచి అంతగా లబ్ధిపొందకపోయినా, అడ్డుతోవలు తొక్కకపోయినా రతన్ తన హయాంలో టాటా గ్రూప్‌ను ఎంతో విస్తరించగలిగారు. పాలకుల ఆశీస్సులతో అనతికాలంలోనే అతివేగంగా ఎదిగిపోయి, అపరకుబేరులుగా అవతరించడమనే అబ్బురపరచే విన్యాసాలు లేవు కానీ, రెండు దశాబ్దాల చైర్మన్‌గిరీలో ఆయన తన గ్రూప్‌ను నలభైరెట్లు విస్తరించారు, లక్షలాదిమందికి ఉపాధి కల్పించారు. ఒట్టిపోయిన పశువులను కబేళాకు పంపినట్టుగా, అవసరం తీరగానే ఉద్యోగులను ఆవలకు నెట్టేసే విధానాలను ఆయన తన సంస్థల్లో ప్రోత్సహించలేదు. వాటి పని సంస్కృతి, పద్ధతులు కూడా భిన్నమైనవని అంటారు. వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో అనేక ఎదురుదెబ్బలు తిన్న రతన్, బహుశా తన కలల ప్రాజెక్ట్ నానో విషయంలో ఎక్కువ ఒత్తిడికి గురై ఉంటారు. తన రాజకీయ ప్రయోజనాలకోసం మమతాబెనర్జీ ఆదిలోనే ఆ ప్రాజెక్టుకు గండికొట్టడం, దానిని మరొకచోటకు తరలించి, కాస్తంత ఆలస్యంగా ఉత్పత్తి ఆరంభించినా, తాను ఊహించినంతగా ఈ దేశప్రజలు ఆ కారును ఆదరించకపోవడం ఆయన మరిచిపోలేనివి.

ధనికులు మాత్రమే ప్రవేశించగలిగే ముంబైలోని తాజ్‌హోటల్‌లో వీధికుక్కలపట్ల అక్కడి సిబ్బంది ప్రేమపూర్వకంగా వ్యవహరిస్తారనీ, వాటికోసం రతన్ టాటా ప్రత్యేక ఆస్పత్రి నెలకొల్పారని ఆయన జీవకారుణ్యం మీద విభిన్నమైన కథనాలు వస్తున్నాయి. తన పెంపుడు శునకం అనారోగ్యంతో ఉండటంతో బ్రిటిష్‌రాజు ప్రకటించిన జీవనసాఫల్యపురస్కారాన్ని స్వీకరించడానికి రతన్ టాటా వెళ్ళలేదట. లక్షలకోట్ల రూపాయల దాతృత్వంతో, చారిటబుల్ సంస్థల ఏర్పాటుతో, గుప్తదానాలతో ఆయన ఈ దేశప్రజలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆదుకున్నారు. ఆస్పత్రులనుంచి వృద్ధాశ్రమాలవరకూ అన్నింటి ఏర్పాటు వెనుకా ఆయన ఉన్నారు. దోచుకోవడం,

దాచుకోవడం తప్ప, ప్రజలకు ఇవ్వడం తెలియని నయాకుబేరుల కాలంలో రతన్ టాటా ఔన్నత్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించడం, రాజకీయపార్టీలతో చేయికలిపి, తమ పెట్టుబడితో వాటిని అధికారంలోకి తెచ్చి ఆశ్రితపెట్టుబడిదారీ తనంతో లబ్ధిపొందడం ఇప్పుడు చూస్తున్నాం. కరోనాకాలంలోనూ సామాన్యులను దోచుకున్న కంపెనీలను, కోట్లు పోగేసుకున్న ఫార్మా యజమానులనూ చూశాం. రతన్‌టాటా వలె పేదల పట్ల ఆదరణతో, బాధ్యతతో వ్యవహరిస్తూ, వారి ఆరోగ్యం గురించి తన జీవితమంతా ఏకరీతిన కృషిచేసినవారు, అంతపట్టింపుతో పనిచేసినవారు అరుదు. ఈశాన్యరాష్ట్రాలపై పాలకులు పెద్దగా దృష్టిపెట్టనికాలంలోనే ఆయన తన విద్యాసంస్థలను అక్కడకు వ్యాపింపచేసి, చాలా రంగాల్లో ఈశాన్య ప్రజల భాగస్వామ్యాన్ని పెంచారు.

కాన్సర్ ఆస్పత్రులతో సహా పలు వైద్యసంస్థలను నెలకొల్పారు. కొత్తతరం పారిశ్రామికవేత్తల ధనవ్యామోహం, ఆడంబరాలు గమనించినప్పుడు అనాదిగా టాటాల నిరాడంబర జీవన విధానం గుర్తుకొస్తుంది. ఆ వారసత్వానికి తీసిపోనిరీతిలో, మరింత ఉన్నతమైన, ఉదాత్తమైన ప్రవర్తనతో రతన్‌టాటా జీవించారు. ఒక పెద్ద గ్రూప్ అధిపతిగా ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా ఒక కర్మయోగిలాగా వ్యవహరిస్తూ టాటాల పేరును ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచేట్టుచేశారు.

# జాతీయ స్థాయి క్రీడాకారులకు నంద్యాల మహిళా వైద్యుల ఆర్థిక సహకారం

**నంద్యాల అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):**
ఈనెల 14వ తేదీ నుండి గోవా రాష్ట్రంలోని వాస్కో డిగామా రవీంద్ర భవన్ లో నిర్వహించనున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటున్న నంద్యాల పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఐఎంఏ నంద్యాల మహిళా వైద్యులు శుక్రవారం ఆర్థిక సహకారం అందజేశారు.

ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో, రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి ల నిర్వహణలో స్థానిక ఐఎంఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్న నంద్యాల క్రీడాకారులు పల్లవి, మహేష్ ,నరసింహ లకు పదివేల రూపాయల ఆర్థిక సహకారం అందించారు. ఐఎంఏ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ వసుధ రాణి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఐఎంఏ చేస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఈరోజు రాష్ట్రం తరపున పాల్గొంటున్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ సహకారం అందజేశామన్నారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దేశంలో కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఐఎంఏ నంద్యాల ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాధవి, మిషన్ పింక్ హెల్త్ విభాగం గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి,అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి,మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద , పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పల్లవి ,మహేష్, నరసింహ పాల్గొన్నారు.



# సాగునీటి బడ్జెట్ లో 42 శాతం నిధులు రాయలసీమకు కేటాయించాలి.

**రాయలసీమ సమానాభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలి.**

**ముఖ్యమంత్రికి లేఖ వ్రాసిన బొజ్జా దశరథరామిరెడ్డి**



**నంద్యాల అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో చెడును పారద్రోలుతూ, మంచి దిశగా చేపట్టే కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. చెడుపై మంచి గెలుపుకు ప్రతీకగా నిర్వహించే దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రికి దసరా శుభాకాంక్షలు తెలుపుతూ రాయలసీమ సమానాభివృద్ధికి కావలసిన అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి బొజ్జా లేఖ వ్రాసారు. ఈ సందర్భంగా శుక్రవారం నంద్యాల సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ...

"రాయలసీమలో ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయలసీమ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాయలసీమ సాగునీటి రంగానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోతోముఖాభివృద్ధి చెందేలాగా, విధానపర నిర్ణయాలు తీసుకోవడానికి సహకరిస్తుందన్న భావనతో సాగునీటి రంగానికి సంబంధించి కొన్ని గణాంకాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విస్తీర్ణంలో మరియు వ్యవసాయోగ్యమైన భూమిలో రాయలసీమ 42 శాతం కలిగి ఉంది.
2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమిలో 44 శాతం (రాష్ట్ర సగటు) భూమికి, సాగునీరు అందించేలాగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది.
3. రాయలసీమలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమిలో కేవలం 21 శాతం (రాష్ట్ర సగటులో సగానికి దిగువగా) భూమికి, సాగునీరు అందించేలాగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది.
4. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమిలో 30 శాతం (రాష్ట్ర సగటు) భూమికి, నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లభిస్తున్నది.
5. రాయలసీమలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమిలో కేవలం 9 శాతం (రాష్ట్ర సగటులో చాలా తక్కువగా) భూమికి, నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లభిస్తున్నది.

గత పాలకుల తప్పిదాల వల్ల రాయలసీమకు జరిగిన చెడును సరిదిద్ది మంచి జరిగే లాగా, దసరా పండుగ సందర్భంగా "సంకల్పం" చేపట్టాలని బొజ్జా విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర సమగ్రతకు, సమగ్రాభివృద్ధికి అత్యంత కీలకమైన ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాగునీటి బడ్జెట్ లో 42 శాతం (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విస్తీర్ణంలో / వ్యవసాయోగ్యమైన భూమిలో రాయలసీమకు ఉన్న నిష్పత్తికి సమానంగా) నిధులను రాయలసీమ సాగునీటి రంగానికి కేటాయింపు దిశగా తొలి అడుగు వేయాలని కోరారు. తద్వారా నిర్వీర్యమైన రాయలసీమ సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టే కార్యాక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలనీ, రాయలసీమ సమానాభివృద్ధి సాధించే దిశగా రాష్ట్ర విభజన చట్టంలో కల్పించిన బుందేల్కండ్, కోరాపుట్, బోలంగిర్ తరహా ప్రత్యేక ప్యాకేజీ నిధులను కేంద్రం నుండి సాధించి, రాయలసీమను సమానాభివృద్ధి దిశగా పరుగులు పెట్టించాలని చంద్రబాబునాయుడుకి విజ్ఞప్తి చేసారు.

రాయలసీమలో ఏర్పాటుచేసిన కార్యాలయాల తరలింపును విరమించుకుని, వాటిని ఇక్కడే కొనసాగించాలనీ, అలాగే చంద్రబాబునాయుడు గారు ప్రకటించిన విధంగా హైకోర్టు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్, వీటిలో భాగంగా ఏపీ సీడ్స్, ఏపీ విత్తన ధ్రువీకరణ ప్రధాన కార్యాలయాలు, రాష్ట్ర విభజన చట్టంలో పొందు పరిచిన జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ కమిషనరేట్, తదితర మౌళిక వసతుల ఏర్పాటుకు తక్షణమే చేపట్టాలని కోరారు. కృష్ణానది నీటి నిర్వహణకు అత్యంత కీలకమైన శ్రీశైలం రిజర్వాయర్ ఉన్న కర్నూలు జిల్లాలో కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని దశరథరామిరెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసారు.

# డోన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

**డోన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్**

**అసాంఘిక, సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్లల్లో విస్తృతంగా దాడులు**

**ధృవ పత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలు, 03 కార్లు స్వాధీనం**

**డోన్ డిఎస్పీ శ్రీనివాస్**





**నంద్యాల క్రైం, అక్టోబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):**
నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సంధర్భంగా నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డోన్ పోలీసు అధికారులు, క్యుఆర్టీ సిబ్బంది స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి శుక్రవారం తెల్లవారుజామున డోన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని చిగురుమానిపేట నందు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఎలాంటి ధృవ పత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలు, 03 కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ఇంతియాజ్ బాష, రాకేష్, క్యుఆర్టి సిబ్బంది స్థానిక పోలీసులు పాల్గొన్నారు.


# మహిషాసురమర్ధినీ దేవిగా నేడు దుర్గమ్మ దర్శనం

**నవదుర్గల్లో ఇదే అత్యుగ్రరూపం**

**దేవీ నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎన్ఎండి ఫయాజ్**

**నంద్యాల (అక్టోబర్ 11రిపబ్లిక్ న్యూస్)** నంద్యాల స్థానిక పద్మావతి నగర్ లో ఉన్న శ్రీశ్రీశ్రీ జంబులా పరమేశ్వరి దేవాలయం నందు బేడ బుడగ జంగాల పెద్దలు మరియు దేవస్థానం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమము ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్ గారు పాల్గొని ప్రారంభించడం జరిగిందన్నారు

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 9వ రోజైన శుక్రవారం (ఆశ్వయుజ శుద్ధ నవమి) నాడు కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ శ్రీ మహిషాసురమర్ధినీ దేవిగా దర్శనమిస్తుందన్నారు . అష్ట భుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంహరించింది ఈ రూపంలోనే అందుకే ఇది నవదుర్గల్లో అత్యుగ్రరూపం అన్నారు . ఈ రోజున జగన్మాత కనకదుర్గమ్మ లేతరంగు దుస్తుల్లో సింహ వాహనాన్ని అధిష్టించి ఆయుధాలను ధరించిన మహాశక్తిగా భక్తులను సాక్షాత్కరిస్తుందని . ఈ తల్లికి గారెలు, బెల్లంతో కలిపిన అన్నాన్ని నైవేద్యంగా నివేదిస్తారన్నారు . ఇదిలా ఉండగా దసరా శరన్నవరాత్రులు తుది ఘట్టానికి చేరుకున్నాయన్నారు . దశావతారాలలో ఆఖరుగా శనివారంనాడు విజయ దశమి సందర్భంగా జగన్మాత కనకదుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిస్తుందన్నారు . ఈ కార్యక్రమంలో నంద్యాల పుర ప్రముఖులు , బేడ బుడగ జంగాల పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## ఎన్ఎండి ఫిరోజ్ గారి సహకారంతో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిని కలిసిన న్యాచురల్ బాడీ బిల్డర్ హాజీ

**పలు పతకాలను సాధించిన హాజీని అభినందించిన మంత్రి**

**నంద్యాల (అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాలకు చెందిన హాజీ, 65 కేజీ ల న్యాచురల్ బాడి బిల్డింగ్ విభాగంలో స్ట్రాంగ్ మాన్ 2024 నేపాల్ టైటిల్ ను గెలిచి బాంగారు పతకాన్ని ,



పవర్ లిఫ్టింగ్ లో 65 కేజీల విభాగంలో మొత్తం 380 కేజీ లిఫ్ట్ చేసి బాంగారు పతకాన్ని, 65 కేజీల విభాగంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించడం జరిగింది.


మన దేశం తరపున దేశా విదేశాల్లో ప్రతిభా కనబరచిన హాజీ నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారిని కలవగా వారి సహకారంతో ఈరోజు హైదరాబాదులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కల్పించడం జరిగిందన్నారు . మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారు హాజీకి ప్రభుత్వం తరపున నుండి ప్రోత్సాహం అందిస్తామని తెలిపి, అభినందించారు.

# పాణ్యం లో 57 దరఖాస్తులు

**పాణ్యం ( రిపబ్లిక్ న్యూస్):** నియోజకవర్గ కేంద్రం పాణ్యం మండలానికి సంబంధించి 2 మద్యం షాపులకు 57 దరఖాస్తులు వచ్చినట్లు ఆబ్కారి శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం చివరి రోజు కావడంతో మరిన్ని దరఖాస్తులు కూడా వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు మంజూరైనప్పటికీ ఒకటి పొగ ఒకటి ఇంతవరకు నెట్టుకొచ్చింది. దాదాపు 30 వేలకు పైగా జనాభా ఉన్నటువంటి మండలానికి రెండు మద్యం షాపులు ఏర్పాటు చేయడం మందుబాబులకు సంతోషించదగ్గ విషయమైంది అయితే ఈ రెండు మద్యం షాపులు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారన్నది మందుబాబులు ఆశా భావంగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ధరలు భారీగా తగ్గుతాయని ఆశలతో మందుబాబులు గాలి వదిలేసి మందు వాసనతో ఎదురుచూస్తున్నారు.

# దసరా పండుగ గ్రామోత్సవం సందర్భంగా గట్టి నిఘా ఏర్పాటు..

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈనెల 12 న రాత్రి జరిగే గ్రామోత్సవం (తొట్టి మెర వణి) సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు ఆళ్లగడ్డ టౌన్ ఎస్.ఐ షేక్ నగిన తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్కు ఇబ్బందులు కలిగించినా, మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొన్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై నగీన హెచ్చరించారు.



ఆర్యవైశ్య సంఘం కమిటీ వారిని కూడా పిలిపించి సూచనలు ఇవ్వడం గ్రామోత్సవం నిర్వహణపై తగు సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఎస్సై షేక్ నగీనా వివరించారు.

# జర్నలిస్టులపై దాడులకి తెగబడే వారికి హెచ్చరిక...

**హెచ్చరిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు**




**నంద్యాల (అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంరక్షణ కోసం కొత్త చట్టాన్ని రూపొందించింది...

సుప్రీంకోర్టు కూడా జర్నలిస్టులపై దాడులు జరిగితే సహించేది లేదంటూ పలు సెక్షన్ కింద కేసు నమోదు చేయాలంటూ తీర్పుని ఇవ్వటం జరిగింది...

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జర్నలిస్టులపై అసభ్యకర కామెంట్స్ చేసిన దాడులకి తెగబడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవంటూ హెచ్చరిక జారీ చేసింది... ముఖ్యమంత్రి చెప్పినా కూడా కొన్ని ప్రాంతాల్లో జర్నలిస్టులపై దాడులు కామెంట్స్ జరుగుతున్న క్రమంలో కొన్ని జర్నలిస్టు సంఘాలు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలవనున్నట్లు విశ్వసనీయమైన సమాచారం...

# శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో శ్రీశ్రీశ్రీ కాళికాంబ మాత....



**ఆళ్లగడ్డ అక్టోబర్ 11 రిపబ్లిక్ న్యూస్** ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప నగర్ లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కాళికామాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్ర చారి.మహిళా కమిటీ అధ్యక్షురాలు దురుగడ్డ అనురాధ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 9వ రోజు శుక్రవారం ఉదయం సుప్రభాతం,అభిషేకము, అనంతరం ప్రధాన అర్చకులు చంద్రశేఖర ఆచారి అమ్మవారిని పట్టు వస్త్రాలు ఆభరణాలు వివిధ రకాల పుష్పాల చేత రాజరాజేశ్వరి దేవి అలంకరణలో శ్రీ కాళికామాత కొలువై ఉన్నారు.ఈ సందర్భంగా ఎన్ వి లక్ష్మీదేవి (కీ.శే అన్నయచారి భార్య)ఎన్. వి.వీరబ్రహ్మేంద్ర ఆచారి, (శిల్పి) ఎన్ వి ఆర్ నరసింహ చారి.మరియు దురగడ్డ బద్రి నారాయణ, ఆచారి ధర్మపత్ని దురగడ్డ విజయలక్ష్మి,ఉభయ దారులుగా వ్యవహరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ రాజరాజేశ్వరి దేవి శ్రీ కాళికామాత అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రచార కార్యదర్శి రామాచారి, మరియు ఆలయ కమిటీ సభ్యులు. మహిళా కమిటీ సభ్యులు. యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## మాజీ ఎంపీపీ సత్యవేణమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**రుద్రవరం అక్టోబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్):** మండల కేంద్రమైన రుద్రవరంలోని బలిజ కాలనీలో అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీపీ సత్యవేణమ్మను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శుక్రవారం పరామర్శించారు. గత కొద్దిరోజుల నుండి సత్యవేణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గ్రామానికి చేరుకుని పరామర్శించి ధైర్య పడొద్దు అండగా ఉంటానని సత్యవేణమ్మకు భరోసా ఇచ్చారు. సత్యవేణమ్మ భర్త మాజీ సర్పంచ్ టిడిపి సీనియర్ నాయకుడు పోలా గురుమూర్తిని సత్యవేణమ్మ అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని దేవుడి దయవల్ల ఆమె క్షేమంగా త్వరగా కోలుకుంటుందని పోలా గురుమూర్తికి ధైర్యం చెప్పారు. ఆమెతోపాటు మాజీ జెడ్పిటిసి టిడిపి మండల కన్వీనర్ ఎల్వీ రంగనాయకులు శెట్టి, అల్లడి చంద్రశేఖర్, పేరూరు రామ్నాథ్ రెడ్డి, బండారు బాలరాజు, ఏరువా కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, మజ్జిగ చంద్ర తో పాటు పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

### జిల్లా మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు.

**నంద్యాల ప్రతినిధి , అక్టోబర్ 11, పబ్లిక్ న్యూస్ ::** చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు కూడ ప్రజలందరూ విజయదశమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మల గన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, చాలా పెద్దమ్మ దుర్గమ్మతల్లి ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించడంతో పాటు నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని వారు ఆ ప్రకటలో ఆకాంక్షించారు.

## నిత్యాసర వస్తువుల ప్రత్యేక కౌంటర్లు.

### జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్.




**నంద్యాల ప్రతినిధి, ::** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యాసర వస్తువులు సరసమైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం శ్రీనివాస్ సెంటర్ సమీపంలోని రైతు బజార్ లో పౌర సరఫరాల శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ప్రారంభించి వినియోగదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ నూనెలు అధిక ధరలు వున్న నేపథ్యంలో నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులతో మాట్లాడి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల పట్టణం శ్రీనివాస నగర్ లోని రైతు బాజార్, టేక్కే మార్కెట్ యార్డ్ లో ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. అలాగే ఆత్మకూరులో రెండు కేంద్రాలు, నందికోట్కూరు, బనగానపల్లి మండల కేంద్రాలలోను ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. సన్ ఫ్లవర్ (లీటరు)124 రూపాయలు, పామ్ ఆయిల్ (లీటరు) రూ. 110 చొప్పున రూపాయలు చొప్పున ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. అలాగే అన్ని రైతు బజార్లలో టమాట కేజీ రూ.40 లకు, ఉల్లిగడ్డ కేజీ రు.35 చొప్పున వినియోగదారులకు విక్రయిస్తామని జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.




# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**నంద్యాల ప్రతినిధి , అక్టోబర్ 11, రిపబ్లిక్ న్యూస్ ::** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా ఈ నెల 13 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో ఉన్న మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## జిల్లా ప్రజలందరికీ, పోలీసు అధికారులు , సిబ్బందికి విజయ దశమి శుభాకాంక్షలు

### -జిల్లా ఎస్పీ
### జిల్లా పోలీసు కార్యలయంలో ఘనంగా ఆయుధ పూజా
### -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



**నంద్యాల క్రైం, అక్టోబర్ 11, (రిపబ్లిక్ న్యూస్):** దానికి పట్టణంలోని బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా పోలీసు కార్యలయం నందు గల అర్ముడు రిజర్వ్ విభాగం నందు గల ఆయుధాగారం నందు దుర్గామాతకు అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా ప్రజలు, జిల్లా, రాష్ట్ర పోలీసులు సుఖఃశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం పోలీసు ఆయుధాగారంలోని పోలీసులు దైనందిన విధుల్లో వినియోగించే అన్నిరకాల ఆయుధాలకు మరియు మోటారు ట్రాన్సుపోర్ట్ విభాగంలోని వివిధ రకాల వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ ప్రార్థిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు ముందుగా జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తు దుర్గా మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, జిల్లా, రాష్ట్ర పోలీసులు సంతోషంగా జీవించాలని,జిల్లా పోలీసులకు తమ దైనందిన



విధులు, సేవల్లో విజయాలు చేకూరాలని , ఆయు:రారోగ్యాలతో ప్రజలతో మమేకమై పోలీసుశాఖ ప్రతిష్ట పెంపొందేలా పోలీసు విధులు ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, జిల్లా సాయుధ పోలీస్ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్ధిదాయిని అలంకారంలో శ్రీభ్రమరాంబికాదేవి

**నంద్యాల జిల్లా:** శ్రీశైలం లో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాటికి ఉత్సవాలు తొమ్మిదవరోజుకు చేరుకున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఈరోజు సిద్ధిదాయిని అలంకారంలో శ్రీ భ్రమరాంబికాదేవి భక్తులకు దర్శనమిస్తున్నారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఇవాళ సాయంత్రం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయ రెడ్డి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి శ్రీ స్వామి అమ్మవారికి ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అశ్వవాహనంపై ఆశీనులై పూజలందుకొనున్న అది దంపతులు.. రాత్రి క్షేత్ర పురవీధుల్లో శ్రీస్వామి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. కాగా ఎనిమిదో రోజు గురువారం భ్రమరాంబిక అమ్మవారు మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అత్యంత శాంతమూర్తిగా కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం వాహనసేవలో భాగంగా మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవి నందివాహనంపై దర్శనమిచ్చారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ పెరిగింది దసరా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కావడంతో మల్లన్న క్షేత్రం భక్తులతో కళ కళలడుతోంది. భక్తులు వేకువజామునుంచే పవిత్ర పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయ క్యూలైన్‌లలో.. కంపార్టుమెంట్లలో బారులు తీరారు. దీంతో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి అమ్మవారి దర్శనానికి సుమారు 3 నుంచి 4 గంటల సమయం పడుతోంది. భక్తులు శ్రీస్వామివారికి రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో క్యూ




లైన్స్,కంపార్టుమెంట్లలో అల్పాహారం, పాలు, బిస్కెట్లు మంచి నీరు ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు.

# సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపాటు

**హైదరాబాద్ అక్టోబర్ 11, రిపబ్లిక్ న్యూస్:** సీఎం రేవంత్ తనపై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. “సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ కొందుర్గులో మాట్లాడిన మాటలు చాలా విద్దూరంగా ఉన్నాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. ఎస్సీ, ఎస్టీలను గొర్రెలకు బర్రెలకు పరిమితం చేశారని రేవంత్ నింద వేయడంపై అన్ని వివరాలతో శనివారం మీడియా ముందుకు వస్తా.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నుండి ముగ్గురు సాఫ్ట్ బాల్ క్రీడాకారులు తైవాన్ ఇంటర్నేషనల్ టోర్నీకి సెలక్ట్ అయ్యారు. వాళ్ల ఛార్జీలకు ఐదు లక్షల రూపాయలు కూడా ఇవ్వట్లేదట. మరి ఆ పిల్లలు ఇక గొర్రెలు బర్రెలు కాయకపోతే ఏం చేస్తరు? కేసీఆర్ పాలనలో ప్రతిభావంతులైన బిడ్డలకు క్షణాల్లో లక్షల రూపాయల సాయం అందేది. దానికి నేనే ప్రత్యక్ష సాక్షిని” అని ప్రవీణ్ పేర్కొన్నారు.

**రేవంత్ ఏమన్నారంటే..** బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా పాఠశాలలను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మూసేయించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. “దసరా నాలుగు కోట్ల ప్రజలకు సుఖ శాంతులు ఇవ్వాలని కోరుకుంటున్న. ప్రభుత్వం ఏర్పడిన రోజునే వాగ్దానం చేశాం. రాష్ట్రాన్ని విద్యా, వైద్య రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని చెప్పాం. బీఆర్ఎస్ సర్కార్ ఐదు వేల పాఠశాలలను మూసివేసి.. అణగారిన వర్గాలకు విద్యకు దూరం చేసింది. అందుకే ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్యను అందించాలని అనుకున్నాం. అందుకే విద్యా శాఖలో సంపూర్ణంగా మార్పులు చేశాం. కోరుకున్న విధంగా బదిలీలు జరిపాం. ఏ చిన్న పొరపాటు లేకుండా 21 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి ఇచ్చాం. అధికారులతోనే ఇది సాధ్యపడింది. ఏడు లక్షల కోట్ల అప్పు చేసిన కేసీఆర్ ఏనాడూ విద్యాభివృద్ధికి కృషి చేయలేదు. పేదలు చదవకూడదన్నది వారి ఉద్దేశం. %ూఎ% నరసింహారావు 1971 లో గురుకుల విద్యా వ్యవస్థను తెచ్చారు. అందులో చదివిన ఎంతోమంది నిరుపేదలు పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన గురుకులాల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా. కనీస వసతులు కల్పించలేదు. ఈ విషయాలు నగ్న సత్యాలు. వీటిని బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అంటే నాకు గౌరవం.. మీరు ఎక్కడ ఉంటారో మీ ఇష్టం. కానీ మీరు కూడా పేదలకు విద్య అవసరం లేదని అనుకుంటున్నారా. బీసీ, ఎస్సీ, ఎస్టీలు.. కుల వృత్తులకే పరిమితం కావాలా. పిల్లలకు చదువు చెప్పడం, పేదలకు వైద్యం అందించడం మా విధానం. మీ విధానం, మీరు సీఎం



కావడం, కొడుకు, అల్లుడిని మంత్రిని చేయడం, మరొకరిని ఎంపీని చేయడం. వాళ్లందరినీ ఓడించినా బుద్ధి మారలేదు. పేదలందరికీ నాణ్యమైన విద్యనందించేందుకే రెసిడెన్షియల్ పాఠశాలలు పెడుతున్నాం. బీఆర్ఎస్ నేతలకు వారి పార్టీ కార్యాలయాలకు భూమి ఉంటుంది కానీ, బడులు కట్టడానికి భూమి, నిధులు ఉండవు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు వేర్వేరు పాఠశాలలుంటే వారిలో కల్మషాలు పెరగవచ్చు. కనుక అందరినీ ఒకే దగ్గర చదివిస్తే సోదర భావం పెరుగుతుందని ఇలాంటి సమీకృత పాఠశాలలను కట్టాలనే ఆలోచన వచ్చింది” అని రేవంత్ పేర్కొన్నారు.

## దుర్గమ్మకు హంస వాహన సేవ రద్దు

**విజయవాడ, అక్టోబర్ 11:** దసరా నవరాత్రులు శనివారంతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో చివరి రోజు నిర్వహించే దుర్గమ్మ వారి హంస వాహనం సేవను ప్రభుత్వం రద్దు చేసింది. అమ్మవారి జలవిహారం రద్దు కావడంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. కృష్ణా నదిలో నీటి ప్రవాహ స్థాయి అధికంగా ఉంది. అలాగే ఎగువ ప్రాంతం నుంచి దాదాపు 40 క్యూసెకుల వరద నీరు నదిలో ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో అమ్మ వారి జల విహారాన్ని రద్దు చేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

దాంతో దసరా చివరి రోజు దుర్గా ఘాట్‌లోని గంగా సమేత శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో పూజా కైంకర్యాలను దేవస్థానం అధికారులు నిర్వహించనున్నారు. అందుకోసం దేవాదాయ శాఖతోపాటు నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పనులు చేపట్టారు. ప్రతి ఏడాది దసరా చివరి రోజు... కృష్ణానదిలో అమ్మవారు జల విహారం చేస్తారు.

కన్నుల పండువగా జరిగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మ వారి భక్తులు భారీగా విజయవాడ చేరుకునేవారు. అయితే కృష్ణా నదిలో నీటి ప్రవాహం కారణంగా ఈ ఏడాది అమ్మ వారి జలవిహారాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అదీకాక ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా విజయవాడకు వరద నీరు పోటెత్తింది. దీంతో విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. అందులోభాగంగా సహాయక చర్యలు చేపట్టింది. దీంతో కొద్ది రోజుల్లోనే విజయవాడకు వరద ముంపు నుంచి ఉపశమనం లభించినట్లు అయింది.

ఈ వరద కారణంగా విజయవాడ నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పిలుపు మేరకు టాలీవుడ్ పరిశ్రమలోని పెద్దలతోపాటు ప్రజలు సైతం భారీగా కదిలి వచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా వరద నష్టంపై అంచనా వేసి నిధులను తక్షణ చర్యల్లో భాగంగా విడుదల చేసింది. ఇంకోవైపు విజయవాడలోని కృష్ణా నదిలో వరద ఉధృతి ఏ మాత్రం తగ్గడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కృష్ణా నదిలో అమ్మవారికి హంస వాహన సేవను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అక్టోబర్ 3వ తేదీన ప్రారంభమైన శరన్నవరాత్రులు శనివారంతో ముగియనున్నాయి. ఈ తొమ్మిది రోజులు అమ్మవారు వివిధ అలంకరాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం మహిషాసురమర్ధిని రూపంలో.. శనివారం శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి రూపంలో ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన దుర్గమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్న సంగతి తెలిసిందే.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com